క్లుప్తంగా

అయోధ్య సేవ అదృష్టం



రాంచంద్రారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

బొంరాస్‌పేట: అయోధ్యసేవలో పాల్గొనడం మానవజన్మకు అదృష్టంగా భావించాలని హిందూ ప్రముఖులన్నారు. మూడున్నర దశాబ్దాల క్రితం అయోధ్య కరసేవలో పాల్గొని రామభక్తిని, యుక్తిని చాటుకున్న మండల కేంద్రానికి చెందిన రాంచంద్రారెడ్డిని ఆదివారం అయోధ్య కండువాతో సన్మానించి గౌరవించారు. 1990లో అయోధ్యలోని రామజన్మభూమి కరసేవలో మండల కేంద్రం నుంచి రాంచంద్రారెడ్డి, ఉమాపతి కరసేవకులుగా వెళ్లారు. తాజాగా అయోధ్యనుంచి తీసుకువచ్చిన అయోధ్య కండువాతో సన్మానించారు. ఇందులో రామభక్తులు ఉప్పరి జగదీశ్వర్, మల్లేశం, నర్సింలునాయుడు పాల్గొన్నారు.

శ్రీశైలానికి పాదయాత్రగా శివస్వాములు



పాదయాత్రగా బయలుదేరిన శివస్వాములు

బొంరాస్‌పేట: శ్రీశైలంలో వెలసిన పరమశివుని దర్శనానికి మండలంలోని ఆయా గ్రామాల భక్తులు, వీరశైవులు, శివమాలధారులు పెద్ద ఎత్తున పాదయాత్ర చేసుకుంటూ దర్శనానికి వెళ్లారు. ఈ నెల 26న మహాశివరాత్రి సందర్భంగా స్వామివారి సన్నిధిని చేరుకొని ముక్తిని ప్రసాదించమని పూజించనున్నారు. బొంరాస్‌పేట, రేగడిమైలారం, నాందార్‌పూర్, దుప్‌చర్ల, తుంకిమెట్ల, ఎన్కేపల్లి తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివెళ్లారు. పాదయాత్రగా వెళ్లిన ప్రముఖుల్లో విజయవర్ధన్, వీరప్ప, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అటెండర్ కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న మహిళా సమాఖ్య సిబ్బంది

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం మహిళ సమాఖ్య కార్యాలయంలో పని చేస్తున్న చాకలి రాములు అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మహిళా సమాఖ్య కార్యాలయ సిబ్బంది మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆదివారం కుటుంబ సభ్యులకు రూ.20వేలు ఆర్థిక సహాయం అందజేశారు. 20 ఏళ్ల కార్యాలయంలో అటెండర్‌గా అతను చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికచింతన అలవర్చుకోవాలి



పూజలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొందుర్గు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం గుంజల్‌పహాడ్‌లోని అభయాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం సీతారామచంద్రస్వామి, శివలింగం, నవగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతలో భక్తిమార్గం పెంపొందేలా చూడాలన్నారు. సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సనాతన ధర్మాన్ని పాటిస్తూ సమసమాజ స్థాపనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హఫీజ్ పాల్గొన్నారు.

వైభవంగా మైసమ్మ బోనాలు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో ఆదివారం నూతనంగా నిర్మించిన రక్తమైసమ్మ దేవాలయంలో అమ్మవారి బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచే గ్రామస్తులు పూజలు నిర్వహించారు. డప్పుచప్పుళ్ల మధ్య బోనాల ఊరేగింపుతో గ్రామస్తులు ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మొక్కజొన్న సాగు.. భలే బాగు



ఎన్కేపల్లిలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంట

- పెట్టుబడి, కూలీల ఖర్చు తక్కువ
- ఆసక్తి చూపిస్తున్న రైతులు

మోమిన్‌పేట: రబీలో మొక్కజొన్న సాగు భలే బాగు అని రైతులు పేర్కొంటున్నారు. నీటి సౌకర్యం ఉన్న రైతులు జొన్న, మొక్కజొన్నపైనే మక్కువ చూపుతున్నారు. అడవి పందుల బెడద ఉన్నప్పటికీ వాటి నుంచి రక్షించుకునేందుకు సోలార్ ప్యానెల్‌ను ఏర్పాటు చేసుకొని మరీ సాగు చేస్తున్నారు. ముఖ్యంగా పెట్టుబడులు, కూలీల ఖర్చు తక్కువ. స్థిరమైన ఆదాయం రావడంతో రైతులు ఈ పంటలను ఎంచుకుంటున్నారు. కూరగాయల సాగుకు పెట్టుబడి, కూలీ ఖర్చులు ఎక్కువవుతున్నాయి. దీంతో పాటు స్థిరమైన ఆదాయం రాకపోవడంతోనే రైతుల చూపు ఆదాయం ఇచ్చే పంటలపై మరలుతుంది.

ఖరీఫ్ నుంచి రబీలో..

ఒకప్పుడు ఖరీఫ్‌లో జొన్న సాగు చేసే వారు. ప్రస్తుతం ఖరీఫ్‌లో సాగు ఇబ్బందిగా మారుతుండటంతో రబీలో సాగుకు ఆసక్తి చూపిస్తున్నారు. మార్కెట్‌లో క్వింటాల్ జొన్నలకు రూ.3వేల పైమాటే. ప్రభుత్వ మద్దతు ధరే క్వింటాల్‌కు రూ.2,950లుగా ఉంది. దీంతో పాటు ఈ పంటలకు మార్కెటులో సరైన డిమాండ్ ఉంది. మొక్కజొన్నకు బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.2,350లు ధర పలుకుతుంది. రబీలో దిగుబడులు ఆశించిన స్థాయిలో వస్తుండడంతోనే దీనిపై మక్కువ చూపుతున్నారు.

మండల పరిధిలో..

మండల పరిధిలోని చీమల్‌దరి, చక్రంపల్లి, మోమిన్‌పేట, ఎన్కతల, ఎన్కేపల్లి, దుర్గంచెర్వు, వెల్‌చాల్, టేకులపల్లి తదితర గ్రామాల్లో విరివిగా సాగు చేస్తున్నారు. గత సంవత్సరం ప్రభుత్వ మద్దతు ధర రూ.2,950లుగా ఉండగా, మోమిన్‌పేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు చేశారు. రైతులు మార్కెట్‌కు తరలించకుండా, దళారుల పాలు కాకుండా నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోనే డబ్బులు జమ చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధరకు నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేయడం వల్లే ప్రస్తుత సంవత్సరంలో జొన్న, మొక్కజొన్న విస్తీర్ణం పెరిగింది.

స్థిరమైన ఆదాయం



కూరగాయల పెట్టుబడులు పెరుగుతున్నాయి. జొన్న, మొక్కజొన్న సాగుకు పెట్టుబడులు తక్కువ అవుతున్నాయి. స్థిరమైన ఆదాయం రావడంతో రబీలో సాగు చేస్తున్నాం. రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నాను. అడవి పందుల నుంచి రక్షించుకుంటే సరిపోతుంది. పీఏసీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయడం వల్ల ఇబ్బందులు తొలగుతున్నాయి. – ఆనందం, రైతు, ఎన్కేపల్లి

జొన్న సాగుకు పెట్టుబడి తక్కువ



జొన్న, మొక్కజొన్న సాగుకు పెట్టుబడులు ఇతర పంటలతో పోలిస్తే చాల తక్కువ. దిగుబడులు కూడా ఖరీఫ్‌లో కంటే రబీలో ఎక్కువగా వస్తాయి. నాణ్యమైన విత్తనాలను విత్తుకుంటే అధిక దిగుబడులు సాధ్యం. అడవి పందుల నుంచి రక్షించుకుంటే సరిపోతుంది. ధీమాగా స్థిరమైన ఆదాయం పొందొచ్చు. – జయశంకర్, వ్యవసాయాధికారి, మోమిన్‌పేట

కోట్‌పల్లి రోడ్డు గుంతలమయం



గుంతల రోడ్డు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

బంట్వారం: కోట్‌పల్లి నుంచి ఓగులపూర్ గేటు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా తయారైంది. దీంతో ఈ రోడ్డుగుండా ప్రయాణించాలంటే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలో ప్రమాదాల బారిన పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఏదైనా అనుకోని ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ రోడ్డు వల్ల సమీప గ్రామాలకు అంబులెన్స్ కూడా సకాలంలో చేరుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. గుంతలు పడిన రోడ్డుపై ద్విచక్ర వాహనదారులు రాత్రి వేళల్లో ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. దీన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

కందుకూరు: మండల పరిధిలోని పెద్దమ్మతండాలోని పెద్దమ్మతల్లి దేవాలయంలో ఆదివారం రెండోరోజు గిరిజనులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకుడు లచ్యానాయక్ ఆధ్వర్యంలో బ్రాహ్మణులు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. పూజల్లో కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, మాజీ సర్పంచ్ సుమన్‌నాయక్, నాయకులు రాములునాయక్, శంకర్‌నాయక్, రవినాయక్, లక్ష్మణ్‌నాయక్, వర్ష, సురేశ్ పాల్గొన్నారు.

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత



విరాళం అందజేస్తున్న దాత డాక్టర్ వైభవ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ విజయలక్ష్మి

చేవెళ్ల: దైవచింతనతోనే ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత లభిస్తోందని మాజీ ఎంపీపీ ఎం.విజయలక్ష్మి అన్నారు. మండలంలోని మల్కాపూర్ గ్రామంలోని భువనేశ్వరి సహిత మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం శివస్వాముల మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ పూజల్లో మండల బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి గాను బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి రూ.1లక్ష విరాళం ఆలయ కమిటీ సభ్యులకు విజయలక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఆలయాల నిర్మాణాలతోనే ప్రశాంత వాతావరణం నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అనంత్‌రెడ్డి, శర్వలింగం, ఆంజనేయులు, ఇంద్రసేనారెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాస్, ప్రవీణ్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి, జయసింహ, అఖిల్, సందీప్, ఆనంద్, శివారెడ్డి, రవీందర్‌రెడ్డి, గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

సహపంక్తి భోజనాలతో సంతోషం



వనభోజనంలో అంకిత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

పరిగి: వనభోజనాలు సంతోషాన్నిస్తాయని అంకిత స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్లు నవీన్‌కుమార్, మల్లారెడ్డి, పేర్కొన్నారు. జిల్లాలోని సంస్థ ప్రతినిధులకు ఆదివారం వన భోజనం ఏర్పాటు చేశారు. దుద్యాల మండలం పోలేపల్లిలో నిర్వహించగా ఆ సంస్థ డైరెక్టర్లు, స్టేట్ కోఆర్డినేటర్ డానియల్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అందరితో కలిసి సహపంక్తి భోజనాలు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సిబ్బంది అన్ని స్థాయిల వారు కలిసి పనిచేస్తేనే ఒక వ్యవస్థ నిలబడుతుందన్నారు. అంకిత సంస్థ కార్మికుల హక్కుల కోసం, ప్రభుత్వాలు కార్మికులకు అందించే సంక్షేమాలను సంస్థ ముందుండి వారికి అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పరిగి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చంద్రయ్య, జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశ్‌కుమార్, ప్రవీణ్, అంజద్, బషీర్, వెంకటయ్య, అనంత్, సాయి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ విజయలక్ష్మి, నాయకులు

చేవెళ్ల: క్రీడాపోటీలు యువతకు నూతన ఉత్తేజాన్ని అందించడంతో పాటు వారిలోని ప్రతిభ వెలికితీయడానికి దోహదం చేస్తాయని మాజీ ఎంపీపీ విజయలక్ష్మిరమణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కేవీఆర్ గ్రౌండ్‌లో ఆదివారం పర్మన్న చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పి.దయాకర్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆమె స్థానిక నాయకులు, యువకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రామన్నగూడ గ్రామానికి చెందిన దివంగత జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పెద్దోళ్ల పర్మయ్య పేరుపై ఆయన కుమారుడు పెద్దోళ్ల దయాకర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి పేదలకు సాయం అందించటంతో పాటు టోర్నమెంట్‌లు నిర్వహించేందుకు ముందుకురావడం అభినందనీయమని కొనియాడారు. మండలంలోని యువత ఇలాంటి పోటీలను సద్వినియోగం చేసుకొని మండలం నుంచి జిల్లాస్థాయి వరకు ఎదగాలని కోరారు. ట్రస్ట్ చైర్మన్ దయాకర్ మాట్లాడుతూ.. మండలంలోని యువత కోసం ఈ పోటీలు ఏర్పాటు చేశామని, ఈ టోర్నమెంట్‌కు క్రీడాకారుల నుంచి భారీ స్పందన లభిస్తోందన్నారు. ఈ టోర్నమెంట్‌లో విజేత జట్టుకు రూ.50వేలు, రన్నరప్ జట్టుకు రూ.25వేలు అందించనున్నట్లు చెప్పారు. ప్రతి రోజు రెండు మ్యాచ్‌ల చొప్పున పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి, యువ నాయకులు డాక్టర్ వైభవ్‌రెడ్డి, పలువురు నాయకులు, యువత, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకులాల ప్రవేశపరీక్ష



తాండూరు రూరల్: జినుగుర్తి గిరిజన గురుకుల పాఠశాలలో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు



బండవెల్కిచర్లలోని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు వారి తల్లిదండ్రులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి సమీపంలోని తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాలలో ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 320 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 310 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ హేమలత తెలిపారు. గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగిందన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: ఉమ్మడి గురుకులాల ప్రవేశపరీక్ష ఆదివారం 5వతరగతి, 6వ తరగతి నుంచి 9వతరగతి వరకు ప్రవేశాలకు ప్రవేశపరీక్షను నిర్వహించారు. కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని గిరిజన గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 5వ తరగతిలో 260మంది విద్యార్థులకు గాను ముగ్గురు గైర్హజరయ్యారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు 257మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయాల్సి ఉంది. ఇక్కడ 11మంది గైర్హజరాయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు. 7వ తరగతి ప్రవేశపరీక్ష వ్రాయాల్సిన బ్యాగరి గణేష్ అనే విద్యార్థి హాల్‌టికెట్‌లో మంగలి ఈశ్వర్ అని పేరు రావడం, కులం పేరు సైతం తప్పుగా ఉండటంతో అధికారులు అతనిని పరీక్షకు అనుమతివ్వలేదు.

గ్రామాల సంక్షేమమే లక్ష్యం



దోమ: సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు

కాంగ్రెస్ జిల్లా నాయకుడు వీరారెడ్డి

దోమ: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ గందెరాములు, గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అంతిరెడ్డి, నర్సింహారెడ్డితో కలిసి ఆయన సీసీ రోడ్డు, అండర్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ..ప్రభుత్వం గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతీ గ్రామంలో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణాలకు ప్రత్యేక నిధులను కేటాయిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు శేఖర్, రాములు, గఫూర్, హమూద్, వెంకట్‌రెడ్డి, బాల్‌రాజ్, జంగయ్య, భాస్కర్, భీమయ్య, మహేశ్, యాదయ్య, ఇంతియాజ్, ముబెర్, ప్రవీణ్‌రెడ్డి, నాగయ్య, శ్రీనివాస్, నర్సింహా, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

పరిగిలో..

పరిగి: నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు కాంగ్రెస్ జిల్లా నాయకులు వీరారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని రంగంపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. గత ప్రభుత్వం గ్రామాల్లోని సమస్యలను పట్టించుకోలేదన్నారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చిందంటే తప్పకుండా తీరుస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం సంవత్సరంలోనే ఆరు గ్యారంటీలను అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

క్రీడలతో మానసికోల్లాసం

టోర్నమెంట్ నిర్వాహకుడు రాజు

షాబాద్: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని టోర్నమెంట్ నిర్వాహకుడు సబ్బరిగారి రాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని బోడంపహాడ్ గ్రామంలో గ్రామస్థాయి క్రికెట్ పోటీలను నెలరోజులుగా నిర్వహించారు. ఆదివారం విజేతలుగా నిలిచిన బీపీడీ నైట్ రైడర్స్ జట్టుకు రూ.10వేల నగదు, బీపీడీ రాయల్ ఛాలెంజర్స్ జట్టుకు రెండో బహుమతి రూ.5వేల నగదు, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు రూ.2500 నగదుతో పాటు ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన రాజు మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారులకు ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఓటమి గెలుపునకు నాంది కావాలన్నారు. మాజీ సర్పంచ్ బాలకిష్టయ్య, ఇనాయత్, చెన్న రాములు, శేఖర్, అంజయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా స్వరూప



స్వరూపకు నియామకపత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షురాలు జ్యోతి

షాబాద్: షాబాద్ మండల మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా పి.స్వరూపను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షురాలు పామెన జ్యోతి భీంభరత్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని కుర్వగూడలో నిర్వహించిన సమావేశంలో గ్రామానికి చెందిన పి.స్వరూపను మండల మహిళా అధ్యక్షులిగా నియమించి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. మహిళల సాధికారత కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. దశలవారీగా ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామన్నారు. ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. పార్టీ బలోపేతానికి కాంగ్రెస్ కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పరిగిలో పూర్వవిద్యార్థులు



తాండూరు రూరల్: పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

పరిగి: పట్టణ కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1994–95 పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారు ఒక చోట కలిసి పాఠశాలలో చేసిన అల్లరి పనులు, జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఒకరినొకరు పలకరించుకుని క్షేమ సమాచారం తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థులు అంటే పలువురికి ఆదర్శంగా ఉండాలని వారు నిర్ణయించుకొని సమాజానికి ఉపయోగపడే మంచి కార్యక్రమాలను నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

తాండూరు రూరల్: వారంతా ఒకే పాఠశాలలో విద్యా బుద్ధులు నేర్చుకొని నేడు వేర్వేరు రంగాల్లో వేర్వేరు చోట్ల స్థిర పడ్డారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పెద్దేముల్ మండల కేంద్రాంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 2003–04 పదో తరగతి చదువుకున్న బాలికలు. వారు 21 ఏళ్ల తర్వాత ఒకే చోట కలిసి ఆనందంగా గడిపారు. ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. పాఠశాలలో చేసిన చిలిపి పనులు, మధుర జ్ఞాపకాలను స్మరించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు ఎల్లారెడ్డి, విజయలక్ష్మీ, విద్యావతి, యశోద, రవీందర్‌రెడ్డిలను శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సన్మానించారు.

అనంతగిరిలో..

అనంతగిరి: వికారాబాద్ పట్టణం తక్షశిల డిగ్రీ కళాశాలలో 2009–2012 బికాం పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులను ఘనంగా సన్మానించి తమ కళాశాల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విఠల్‌బాబు, అధ్యాపకులు మోహన్‌రెడ్డి, జహీర్, మోసిన్, గోపాల్, విద్యార్థులు విజయ్, ఓంపాల్‌రెడ్డి, స్వాతి, శ్రీదేవి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.